క్లుప్తంగా

నాయకుల పరామర్శ



వెంకట్రామిరెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లి: మండలంలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ పొన్నేళ్లవాండ్లపల్లెకు చెందిన సింగల్ విండో మాజీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి కోడలు మహేశ్వరి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబీకులను వైఎస్సార్‌సీపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయనతోపాటు విష్ణువర్ధన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, వీవీ.ప్రతాప రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, నాగభూషణ్ రెడ్డి, నాగరాజు యాదవ్, శివశంకర్ ఉన్నారు.

నూతన విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలను తీసుకువస్తున్న గ్రామస్తులు

సిద్దవటం: మండలంలోని భాకరాపేటలో నూతనంగా నిర్మించిన భవానీ శంకర్ ఆలయంలో ప్రతిష్టించేందుకు నూతన విగ్రహాలను శుక్రవారం మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద విగ్రహాలకు పూజలు జరిపి ఊరేగిస్తుండగా.. దారి పొడవునా మహిళలు స్వాగతం పలికారు.

మహాభారత యజ్ఞం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ వరప్రసాద్

వీరబల్లి: మండలంలోని మట్లి పంచాయతీలోని మాండవ్య నది ఒడ్డున గల కోదండ రామాలయం వద్ద మహా భారత యజ్ఞాన్ని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. తొలి రోజున సీతారామలక్ష్మి హరికథ వినిపించారు. అనంతరం ఎస్‌ఐను గ్రామస్తులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ పదమూడు రోజులపాటు జరిగే మహా భారత యజ్ఞం కార్యక్రమాన్ని ఎలాంటి ఆటంకాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కార్యనిర్వాహకులపై ఉందని తెలిపారు.

ఎమ్మెల్యే ఆకేపాటి శివదీక్ష



శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి దంపతులు

రాజంపేట రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తన సతీమణి అమర జ్యోతమ్మతో కలిసి శుక్రవారం శివదీక్ష చేపట్టారు. మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లోని శివాలయం వద్ద శుక్రవారం వేకువ జామున ఎమ్మెల్యే ఆకేపాటి, జ్యోతమ్మ దంపతులు భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను పూజారి శర్మ ఆశీర్వదించారు.

మల్లూరమ్మకు అభిషేకం



ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ తల్లి

చిన్నమండెం: మండలంలోని మల్లూరులో వెలసిన మల్లూరమ్మ తల్లికి అర్చకులు శుక్రవారం అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించి, పూజాది క్రతువులు జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాత కుటుంబ సభ్యులు

రామాపురం: లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో బండపల్లె వద్ద గల ప్రేమాలయం వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం చేశారు. తుమ్మగింజల మహేశ్విన్ పుట్టిన రోజు సందర్భంగా లయన్ ఆంజనేయులు సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధ్యక్షుడు లయన్ శివారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రేపు పూజారివాండ్లపల్లిలో గురుదేవర మహోత్సవం

గాలివీడు: మండలంలోని పూజారివాండ్లపల్లెలో ఆదివారం గురు దేవర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గురుదేవర మహోత్సవం 40 సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్నామని, ఇందుకోసం ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు.

సచివాలయ సేవలు నిల్... సర్వేలు ఫుల్!

గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు సత్వరమే సేవలను అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాలు ఏర్పాటుచేసింది. అయితే వాటి సేవలకు కూటమి సర్కార్ స్వస్తి పలికింది.గత ప్రభుత్వంలో సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు వివిధ రకాల సేవలు అందించేవారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సేవలను పక్కన పెట్టి సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిని ఇంటింటా తిప్పుతోంది. దీంతో ప్రజలకు సచివాలయంలో సేవలు అందకపోవడంతో వారు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం మీ సేవా కేంద్రాలకు,మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

- సచివాలయ సేవలకు స్వస్తి పలికిన కూటమి సర్కార్
- సిబ్బందికి వివిధ రకాల సర్వేల అప్పగింత



గోరాన్‌చెరువు గ్రామంలో నిర్మించిన సచివాలయం

గాలివీడు: మండల వ్యాప్తంగా 14 సచివాలయాలున్నాయి. వాటిలో దాదాపు 154 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రతి ప్రభుత్వ శాఖకు ఒక ఉద్యోగి చొప్పున ఒక సచివాలయంలో 11 మందిని నియమించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల సమన్వయంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కుల ధ్రువీకరణ పత్రం నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాల వరకు అన్ని సేవలను సచివాలయంలోనే అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సేవలకు స్వస్తి పలికింది. సిబ్బందికి వివిధ రకాల సర్వేలు అప్పగించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందనే విమర్శలున్నాయి. సెలవు రోజుతో సంబంధం లేకుండా సర్వేలకు ఆదేశించడం, టార్గెట్లు పెట్టడం, మాతృ శాఖ పనులతోపాటు బీఎల్‌ఓ విధులు, ఇతర పనులను చేయాలని ఆదేశిస్తుండడంతో వారు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. సర్వేల కోసం సచివాలయాల ఉద్యోగులు వీధివీధినా తిరగడంతో సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి.

వివిధ రకాల సర్వేలు

సచివాలయ సిబ్బందిని సర్వేల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పుట్టిన పిల్లలకు బర్త్ సర్టిఫికేట్, ఆధార్ నమోదు ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది. వర్క్ ఫ్రం హోమ్ పేరుతో 18 ఏళ్ల నుంచి 50ఏళ్ల లోపు ఉన్న వారి జాబితాను తయారు చేయాల్సి ఉంటుంది. ఇవేగాక పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ భాగస్వామ్యంతో పీ4 సర్వే, నాన్ ఏపీ రెసిడెన్షియల్ వారిని గుర్తించడం, హౌస్ జియో ట్యాగింగ్ వంటి సర్వేలను చేయిస్తున్నారు. ఇంటింటా తిరిగి సర్వే చేస్తున్నా ఇంటి యాజమాని సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పకపోతే చేసిన పని అంతా వృథా అవుతుంది. మరి మొదటి నుంచి చేయాల్సి ఉంటుందని పలువురు వాపోతున్నారు.

సంక్షేమ పథకాల ఊసే లేదు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రెండువేల జానాభాకు సచివాలయాన్ని ఏర్పాటు చేయడమేగాక, సిబ్బందితో దాదాపు 545 వివిధ రకాల సేవలందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కరికి కూడా కొత్త రేషన్ కార్డుగాని కొత్త పెన్షన్ గాని, ఇంటి స్థలం గాని వచ్చిన దాఖలాలు లేవు.

నాడు అందుబాటులో సేవలు



గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించేవారు. ఏవైనా పత్రాలు కావాలంటే దరఖాస్తు చేస్తే అక్కడే ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రజల అవసరాలు గుర్తించి సచివాలయ వ్యవస్థను పునరుద్ధరిస్తే బాగుంటుంది.
– కె.రమణ,గాలివీడు

ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు



గతంలో ఏ చిన్న అవసరం వచ్చినా సచివాలయానికి వెళ్లి పనులను చేసుకునే వాళ్లం. ఆ సేవలు లేకపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. మీ సేవ కేంద్రాలు, కార్యాలయాలకు పరుగు తీయాల్సిన పరిస్థితి. ప్రజలకు అందించాల్సిన సేవలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సచివాలయ సేవలు కొనసాగించాలి.
– సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

నేడు ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో విద్యుత్ అంతరాయం

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో శనివారం విద్యుత్తు అంతరాయం ఉంటుందని ఒంటిమిట్ట విద్యుత్ శాఖ డీఈ సుబ్రహ్మణ్యం ప్రకటనలో తెలిపారు. ఒంటిమిట్ట మండలంలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు ఉన్నందున ఒంటిమిట్ట, మాధవరం, మంటపంపల్లి, సిద్దవటం మండలం సిద్దవటం, భాకరాపేట, జ్యోతి గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనుమతులు తప్పనిసరి

సుండుపల్లె: సానిపాయి జాతర సందర్భంగా సుండుపల్లె మండలంలోని గ్రామాల ప్రజలు చాందినీబండ్లు కట్టేందుకు పోలీసుల అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు ఓ ప్రకటనలో కోరారు. అనుమతులు లేకుండా చాందినీబండి కడితే ఆర్గనైజర్స్‌పైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీతారాముల కల్యాణం

పుల్లంపేట: పుల్లంపేటలోని రామాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌ను పురవీదులలో మేళతాళాల నడుమ ఊరేగించారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురిపించి పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు కోరుకున్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట

చిట్వేలి: చిట్వేలి గాజుల వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం సీతారామ, లక్ష్మణ ఆంజనేయ ధ్వజమూర్తుల విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు దొనెల రవీంద్ర, వెంకట కల్యాణి కుటుంబీకులు ఆలయానికి నాలుగు వెండి కిరీటాలు, శిఖర కలశం, ధ్వజ స్తంభం వితరణ చేశారు. ఆకేపాటి వెంకట రెడ్డి, ధన లక్ష్మీ కుటుంబసభ్యులు గంట, వెండి దీపాలను బహూకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి సీతారాముల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, ముక్కావరలక్ష్మీ, రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కెకె.చౌదరి, చెవ్వు శ్రీనివాసులురెడ్డి భక్తులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

సర్పంచ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

లక్కిరెడ్డిపల్లి: వడగళ్ల వర్షం, ఈదురు గాలులతో నష్టపోయిన కుర్నూతల గ్రామ సర్పంచ్ రమణయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య కోరారు. ఇటీవల ఈదురుగాలులకు సర్పంచ్ రమణయ్య ఇంటి పైకప్పు ఎగిరిపోయి ధాన్యం బస్తాలతోపాటు ఇతర సామగ్రి తడిచిపోయి తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ ఆయన కుటుంబీకులను శుక్రవారం పరామర్శించారు. ప్రభుత్వం పక్కా గృహం మంజూరు చేయడంతో పాటు సర్పంచ్ కుటుంబానికి అండగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జగన్‌మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ రెడ్డి, సిద్దక నాగిరెడ్డి, రాజారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



సర్పంచ్ కుటుంబీకులను పరామర్శించిన స్థానిక నాయకులు

గంగాభవానీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన

సిద్దవటం: మండలంలోని బంగారుపేట గ్రామ సమీపంలో వెలసిన గంగాభవానీ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం లక్ష కుంకుమార్చన పూజ ఘనంగా నిర్వహించారు. ఫ్యామిలీ ట్రస్టు అధ్యక్షుడు మాడా పెద్దసుబ్బరాయుడు, రామక్రిష్ణయ్య మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఉదయం గణపతి పూజ, స్వస్తి వాచనం, మాతృకపూజ, ఋత్విక్‌వరణం, రక్షాబంధనం, అష్టోత్తర కలశాభిషేకం అర్చన, మంగళహారతి పూజలు జరిపారని తెలిపారు. సాయంత్రం లక్ష కుంకుమార్చన చేసి అమ్మవారి ప్రసాదాలు. మంగళప్రదమైన గాజులు, పసుపు, కుంకుమ అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.



లక్ష కుంకుమార్చన పూజల్లో భక్తులు

అధికారుల వైఫల్యంతోనే చిరుత మృతి

మదనపల్లె : మదనపల్లి మండలం పొన్నూటిపాలెం గ్రామంలో అటవీశాఖ అధికారుల వైఫల్యంతోనే చిరుత మృతి చెందిందని జిల్లా కార్యదర్శి పీఎల్. నరసింహులు అన్నారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ చిరుత ఉచ్చులో చిక్కుకోవడం గమనించిన గ్రామస్తులు ఉదయం 8:00 గంటలకు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి వచ్చినప్పటికీ, మధ్యాహ్నం 1:30 వరకు చిరుతను కాపాడడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. అధికారుల చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి రైతులుపై కేసు నమోదు చేశారని మండిపడ్డారు. అరెస్టు చేసిన రైతుల్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళి,మాధవ్ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

మండలంలోని పొన్నూటిపాళెం వద్ద ఉచ్చులో చిరుతపులి చిక్కుకుని, ప్రాణాలు విడిచిన ఘటనలో ఆ ప్రాంత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పై చర్యలు తీసుకోవాలని, కేసులు పెట్టిన అమాయక రైతులను విడిచిపెట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అడవిలో వేటగాళ్లు ఉచ్చులు బిగుస్తుంటే... క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎందుకు గుర్తించలేకపోయారన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫారెస్ట్ సిబ్బందిపై, ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న నరసింహులు

జీసస్ త్యాగానికి ప్రతీక శుభ శుక్రవారం

రాయచోటి టౌన్: జీసస్ మహా త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జగతికి శాంతి సందేశమిస్తూ క్రీస్తు శిలువ నెక్కిన రోజు గుడ్ ఫ్రైడే అన్నారు. శత్రువులను కూడా ప్రేమతో క్షమించాలని చెప్పిన దయామయుడు ఏసుక్రీస్తు అన్నారు.

రాయచోటి టౌన్: పట్టణంలోని చర్చిలలో శుభ శుక్రవారం వేడుక ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ, చర్చివీధి, బేతల్ కాలనీలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లూథరన్ చర్చి రెవరెండ్ (ఫాస్టర్) ఎస్ఎస్‌జి శుభకర్ మాట్లాడుతూ క్రైస్తవులు జరుపుకొనే పండగలలో మొదటిది క్రిస్మస్, రెండవది గుడ్ ఫ్రైడే అన్నారు. లోక రక్షణకు ప్రయత్నించిన ఏసును రోమ్ సైనికులు అబద్ధపు నింద మోపి శిలువవేశారన్నారు.



ఏసు గొప్పతనం వివరిస్తున్న పాస్టర్ రాజశేఖర్, విజయదాస్

ఏసు సిలువ యాత్ర

సిద్దవటం: మండలంలోని నిర్మలగిరి కాలనీ, చాముడేశ్వరీపేట, భాకరాపేట, సిద్దవటం ఉప్పరపల్లె, మాధవరం–1, టక్కోలు, మోదీన్‌సాబ్‌పల్లె, కడపాయపల్లె గ్రామాలలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. భాకరపేట గ్రామ సమీపంలోని నిష్కలంక మాత చర్చిలో ఏసు సిలువ యాత్ర చేశారు. ఫాదర్ జోసఫ్ లారెన్స్ ప్రార్థనలు చేశారు.

రాజంపేట టౌన్: మానవుల పాపాల నివారణకే ఏసు శిలువపై మరణించారని చర్చి పాస్టర్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం గుడ్‌ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చిల్లో ఉదయం నుంచి సాయంత్రం మూడు గంటల వరకు క్రైస్తవులు, విశ్వాసులు ఉపవాసంతో ప్రార్థనలు చేశారు. క్రీస్తు ప్రేమను ప్రతి ఒక్కరూ పొందాలని, మానవుడి పాపల నుంచి విముక్తి కల్పించి శాంతిమార్గంలో నడిపించే దేవుడు ఏసుప్రభువని తెలిపారు. చర్చిల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

లక్కిరెడ్డిపల్లి: గుడ్ ఫ్రైడే సందర్భంగా దక్షిణ ఆంధ్ర లూథరన్ చర్చిలో ఫాస్టర్ ఎం.రాజశేఖర్, ఎం విజయదాస్‌లతో కలిసి రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు ప్రార్థనలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువ ఎత్తిన రోజును గుడ్ ఫ్రైడేగా పిలుస్తారన్నారు.



రాజంపేట టౌన్: ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

చక్రంపేట మందిరంలో ప్రార్థనలు

పెనగలూరు: మండలంలోని పలు చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. చక్రంపేట కర్మేలు ప్రార్థనా మందిరంలో పాస్టర్ దయాసాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెనగలూరు, తిరునంపల్లి, కట్టావారిపల్లి, కొండూరులోని చర్చిలలో 41 రోజులు ఉపవాసాలు ఉన్నవారంతా శుక్రవారం విరమించారు.



బాకరాపేట సమీపంలోని చర్చిలో సిలువ యాగం చేపట్టిన క్రైస్తవులు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు పట్టణంలోని లూథర్ చర్చిలో గుడ్ ఫ్రైడే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ సోదరులు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఇమ్మాంజల్ బాబు, బాను, ప్రకాష్, ప్రభాకర్, సల్మాన్, విజయ బాస్కర్, భక్తులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టంపై అభ్యంతరాల స్వీకరణకు కమిటీ వేయాలి

రాయచోటి జగదాంబసెంటర్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టంపై ముస్లిం మైనార్టీల అభ్యంతరాల స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేయాలని అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. రాయచోటిలో విలేకరులతో ఆయ మాట్లాడుతూ ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజల ఆస్తులు, స్వేచ్ఛ, హక్కులపై దాడిచేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ముస్లింలకున్న అభద్రతాభావాన్ని పోగొట్టాలని, వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. ఆక్రమణలకు గురైన ఆస్తులను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వక్ఫ్‌కు అందివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేవీ.రమణ, దువ్వూరు నరసింహాచారి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నిమ్మనపల్లె : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ సైదాపేట సకీనా మసీదులో శుక్రవారం నిసార్‌అహ్మద్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. స్థానిక ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు మసీదులో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఆయన గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు అయినప్పటికీ, ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలుచేయలేదన్నారు. చంద్రబాబు పాలనపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జి.నవాజ్, మాజీ ఎంపీటీసీ రఫీ, మస్తాన్, మహబూబ్‌బాషా, సాదిక్, జాబీ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబసమస్యలతో వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ బొగ్గిటివారిపల్లెకు చెందిన రాజశేఖర్ భార్య సుమతి (21) కుటుంబ సమస్యలతో ఇంటి వద్దే పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రేపు నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ సమావేశం

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఆదివారం ఏపీ ప్రైవేటు హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్‌కు చెందిన నిర్వహకులైన వైద్యులు 600 మంది వరకు హాజరవుతారని నిర్వహకులు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వైద్యులతో సమావేశాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివస్తుండటంతో హార్సిలీహిల్స్‌పై అతిథి గృహలన్నీ నిండిపోయాయి.

అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి



లక్కిరెడ్డిపల్లిలో సూచనలు చేస్తున్న అగ్నిమాపకాధికారి రామయ్య



రాజంపేటలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

లక్కిరెడ్డిపల్లి: పెట్రోల్ బంకు, గ్యాస్ గోదాముల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక అధికారి రామయ్య పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా లక్కిరెడ్డిపల్లి ప్రజలకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా బయటపడాలో శుక్రవారం వివరించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ పెద్ద పెద్ద పరిశ్రమలలోనే ఇలాంటి సంఘటనలు జరుగుతాయని, ముందుగానే జాగ్రత్తలు పాటించాలన్నారు. గోదాములోని సిలిండర్ల నుంచి గ్యాస్ లీక్ కాకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

రాజంపేట రూరల్: అగ్నిమాపక శాఖ వార్షికోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక అధికారులు శుక్రవారం స్థానికులకు అవగాహన కల్పించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో అగ్నిమాపక శాఖ అధికారి కె.మాబుసుభాన్ పెట్రోల్ బంక్ సిబ్బందికి డెమో ద్వారా అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగితే 08565-240299కు సమాచారం అందించాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.శివయ్య, సుబ్రహ్మణ్యం, డి.శివయ్య, సి.నాగూర్‌బాషా, ఎస్.వెంకటసుబ్బయ్య, కె.రాజేశ్వర్, సి.రవీంద్రబాబు, యు.రాజన్న, సి.రమేష్‌బాబు, బి.నవీన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.